RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | సోమవారం, ఆగస్టు 31, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 123 | పేజీలు: 8 | వెల : రూ.1



దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ



3 దశాబ్దాల నిరీక్షణకు తెర..

## రేపు వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం

::: సీఎం చంద్రబాబు ట్వీట్

**మార్కాపురంలో కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందన్న సీఎం చంద్రబాబు**

**30 ఏళ్ల వెలిగొండ కలను నిజం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి**

**నల్లమల కొండల గుండా నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు**

**తొలి దశలో లక్షలాది మందికి సాగు, తాగునీటి ప్రయోజనం**

**రేపు వెలిగొండ పండుగ వద్ద కలుద్దామంటూ ప్రజలకు పిలుపు**

మార్కాపురం జిల్లా గడ్డపై సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. మూడు జిల్లాల్లోని లక్షలాది మంది ప్రజల భవిష్యత్తుకు తొలి అడుగు పడనుందని, రేపు కొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోందని ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. కరవు పీడిత ప్రాంత ప్రజలు మూడు దశాబ్దాలుగా కంటున్న వెలిగొండ కల, కృష్ణమ్మ జలాలతో కళ్లముందు నిజం కాబోతోందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రకాశం ప్రజల కష్టాలు తీర్చాలన్న సంకల్పంతో 1996లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు మొదటి దశను పూర్తి చేసి, ప్రారంభించే అవకాశం రావడం తనను భావోద్వేగానికి గురిచేస్తోందని, మనసుకు ఎంతో సంతోషాన్ని

(మిగతా 2వ పేజీలో)

# హైదరాబాద్‌లో 183 కోట్ల భారీ జీఎస్టీ స్కామ్

హైదరాబాద్‌లో వెలుగుచూసిన భారీ జీఎస్టీ మోసం

వ్యాపార సంస్థ జీఎస్టీ ఖాతా హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు

రూ.183.61 కోట్లకు 730 నకిలీ ఇన్వాయిస్‌ల సృష్టి

అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందేందుకు యత్నం

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు, దర్యాప్తు



హైదరాబాద్ : హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఓ వ్యాపార సంస్థకు చెందిన జీఎస్టీ ఖాతాను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు, ఏకంగా రూ.183.61 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ మోసం వెనుక

(మిగతా 2వ పేజీలో)



భారతీయులకు ఉజ్బెకిస్థాన్ గుడ్ న్యూస్..

## 30 రోజుల వీసా ఫ్రీ ప్రయాణం

పర్యాటకం, వాణిజ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఉజ్బెకిస్థాన్ నిర్ణయం

గతేడాది తొలిసారి 1 బిలియన్ డాలర్లు దాటిన ద్వైపాక్షిక వాణిజ్యం

భారత్ తమకు నమ్మకమైన భాగస్వామి అని చెప్పిన ఆ దేశ అధ్యక్షుడు

ప్రధాని మోదీ తాష్కెంట్ పర్యటనలో వెలువడిన ఈ కీలక ప్రకటన



## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమే

టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి

సెప్టెంబర్ నాటికి అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా



వాయిస్ ఆఫ్ ప్రజలు

సోమవారం, ఆగస్టు 31, 2026

## దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ-2026 పరీక్ష..

# జైపూర్‌లో కొందరికి మళ్లీ నిర్వహణ

**మొత్తం 2.65 లక్షలమందికి పైగా హాజరైన అభ్యర్థులు**

**జైపూర్‌లో విద్యుత్ అంతరాయం... 2,445 మందికి మళ్లీ పరీక్ష**

**సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ**

**భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్**



దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (చీదీజుమీ) ప్రకటించింది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది. పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అప్రైజర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని పరీక్షా కేంద్రాలను లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. వీటిని ఢిల్లీ ద్వారకలోని ఎన్‌బీఈఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. ఈ రియల్-టైమ్ నిఘా కోసం ఎన్‌బీఈఎంఎస్, టీసీఎస్‌కు చెందిన 190 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పనిచేసింది. పరీక్షల నిర్వహణ విజయవంతం కావడం వెనుక భాగస్వాములైన వైద్య సంస్థలు, ఫ్యాకల్టీ, భద్రతా ఏజెన్సీలు, టెక్నాలజీ బృందాల సమన్వయం ఉందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. అభ్యర్థులు చూపిన సహనానికి, విశ్వాసానికి ధన్యవాదాలు తెలుపుతూ, పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించింది.

# సెప్టెంబర్ 2న పిఠాపురంలో జనసేన యువజన విభాగం ఆవిష్కరణ



**175 నియోజకవర్గాల్లో ఘనంగా కార్యక్రమాలు..**

**తెలంగాణతోపాటు పలు రాష్ట్రాల్లోనూ నిర్వహణకు సన్నాహాలు**

పిఠాపురం: జనసేన పార్టీ యువజన విభాగాన్ని పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సెప్టెంబర్ 2వ తేదీన ఘనంగా ఆవిష్కరించనున్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 2వ తేదీ ఉదయం 11 గంటలకు జనసేన యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని జన సైనికులు, వీర మహిళలు, పార్టీ నాయకుల సమక్షంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా యువజన విభాగం లోగో, గీతాన్ని ఆవిష్కరించనున్నారు. అలాగే శ్రీ పవన్ కళ్యాణ్ ఆన్‌లైన్ ద్వారా పార్టీ శ్రేణులను ఉద్దేశించి సందేశం ఇవ్వనున్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కేరళలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, ఆన్‌లైన్ ద్వారా యువతకు దిశానిర్దేశం చేయనున్నారు. యువజన విభాగం ఏర్పాటు ఉద్దేశం, విభాగం లక్ష్యాలు, యువతలో రాజకీయ చైతన్యం పెంపొందించడం, ప్రజా సమస్యలపై యువతను భాగస్వామ్యం చేయడం వంటి అంశాలపై ఆయన సందేశం ఉండనుంది.

**175 నియోజకవర్గాల్లో కార్యక్రమాలు**

యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని 175 నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించేందుకు జనసేన పార్టీ శ్రేణులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. ప్రతి నియోజకవర్గంలో యువత, జన సైనికులు, వీర మహిళలు, పార్టీ నాయకుల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా తెలంగాణతో పాటు పలు ఇతర రాష్ట్రాల్లోనూ సెప్టెంబర్ 2న యువజన విభాగం ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. యువతను రాజకీయంగా చైతన్యవంతం చేసి, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలు, సామాజిక బాధ్యతలపై వారిని మరింత క్రియాశీలకంగా తీర్చిదిద్దడమే యువజన విభాగం ప్రధాన లక్ష్యంగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

# భారతీయులకు ఉజ్బెకిస్థాన్ గుడ్ న్యూస్.. 30 రోజుల వీసా ఫ్రీ ప్రయాణం



భారత పౌరులకు ఉజ్బెకిస్థాన్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. భారతీయులకు 30 రోజుల పాటు వీసా రహిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఇరు దేశాల మధ్య పర్యాటకం, వ్యాపార సంబంధాలు, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్‌లో పర్యటిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీతో ఆ దేశ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ జరిపిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ప్రధాని మోదీతో భేటీ సందర్భంగా మిర్జియోయెవ్ మాట్లాడుతూ.. భారత్ తమకు 'నమ్మకమైన వ్యూహాత్మక భాగస్వామి' అని అభివర్ణించారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక, వాణిజ్య సంబంధాలు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. "గతేడాది తొలిసారిగా మన ద్వైపాక్షిక వాణిజ్యం 1 బిలియన్ డాలర్ల మార్కును దాటింది. గత కొన్నేళ్లుగా ఇరు దేశాల సంయుక్త సంస్థల సంఖ్య ఏడు రెట్లు పెరిగింది. ప్రస్తుతం భారత్, ఉజ్బెకిస్థాన్ మధ్య వారానికి 14 ప్రత్యక్ష విమాన సర్వీసులు నడుస్తున్నాయి" అని ఆయన వివరించారు. ఈ వీసా ఫ్రీ నిర్ణయంతో భారత పర్యాటకులు, వ్యాపారులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. కేవలం రాజకీయ, దౌత్యపరమైన సంబంధాలకే పరిమితం కాకుండా సాంస్కృతిక బంధాన్ని కూడా పటిష్ఠం చేసుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. తాష్కెంట్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి సెంటర్ ఫర్ ఇండియన్ కల్చర్, మహాత్మా గాంధీ సెంటర్ ఫర్ ఇండియన్ స్టడీస్ వంటి సంస్థలు సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి దోహదపడుతున్నాయని మిర్జియోయెవ్ పేర్కొన్నారు. ముఖ్యంగా ఉజ్బెకిస్థాన్‌లో యోగాకు విశేష ఆదరణ లభిస్తోందని, 2018లోనే ప్రత్యేకంగా యోగా ఫెడరేషన్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఉజ్బెకిస్థాన్ స్వాతంత్ర్యం పొందిన తర్వాత 1992 మార్చి 18న భారత్‌తో దౌత్య సంబంధాలు ప్రారంభమయ్యాయి. 2011లో ఈ బంధం వ్యూహాత్మక భాగస్వామ్యంగా మారింది. ప్రధాని మోదీ 2015 తర్వాత ఉజ్బెకిస్థాన్‌లో పూర్తిస్థాయి ద్వైపాక్షిక పర్యటన చేపట్టడం ఇదే తొలిసారి. తన పర్యటన ముగించుకున్న అనంతరం మోదీ, కిర్గిజ్ అధ్యక్షుడు సాదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 26వ షాంఘై సహకార సంస్థ (ాజూ) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు బిష్కెక్‌కు చేరుకున్నారు.

**3 దశాబ్దాల నిరీక్షణకు తెర..**

# రేపు వెలిగొండ పండుగ వద్ద కలుసుకుందాం

ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వెలిగొండ కేవలం ఒక ప్రాజెక్టు కాదని, కరవుతో పోరాడిన రైతుకు భరోసా అని, ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలకు ఆరోగ్య భద్రత అని, వలస వెళ్లిన యువతకు సొంతగడ్డపై భవిష్యత్తును ఇచ్చే ప్రగతి మార్గమని ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని చంద్రబాబు వివరించారు. ఈ మహాయజ్ఞం కోసం తమ భూములను, ఇళ్లను, పుట్టి పెరిగిన ఊళ్లను త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితులకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. నల్లమల కొండలను చీల్చుకుంటూ నల్లమల సాగర్‌లోకి కృష్ణమ్మ జలాలు దూసుకువస్తాయని, ఆ ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలను సమూలంగా కడిగేస్తాయని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. రేపటి నుంచి మొదలయ్యే వెలిగొండ జలసిరులు ఆ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు తొడుగుతాయని అన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకుని 'వెలిగొండ పండుగ' వద్ద కలుద్దామంటూ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

# హైదరాబాద్‌లో 183 కోట్ల భారీ జీఎస్టీ స్కామ్

వ్యవస్థీకృత ముఠా హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన నిఖిల్ రెడ్డి, అనంతరెడ్డి అనే సోదరులు హయత్‌నగర్‌లో 'యుక్తా ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్' పేరుతో వ్యాపారం చేస్తున్నారు. ఆగస్టు 3న ఆ సంస్థ అకౌంటెంట్, జీఎస్టీ పోర్టల్‌లో లాగిన్ అయ్యేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. లాగిన్ వివరాలు (క్రెడెన్షియల్స్) తప్పుగా ఉన్నాయని సందేశం వచ్చింది. అనుమానంతో పరిశీలించగా, జులై 23వ తేదీనే గుర్తుతెలియని వ్యక్తులు తమ కంపెనీ జీఎస్టీ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని మార్చేసినట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని యజమానులకు తెలియజేశారు. చార్టర్డ్ అకౌంటెంట్ సలహా మేరకు వారు జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు జోక్యం చేసుకుని ఖాతాలోకి లాగిన్ అయిన తర్వాత అసలు మోసం బయటపడింది. ఖాతాను హ్యాక్ చేసిన దుండగులు, దాని ద్వారా రూ.183.61 కోట్ల విలువైన 730 నకిలీ ఇన్వాయిస్‌లు, ఈ-వే బిల్లులు సృష్టించినట్లు తేలింది. ధన్‌శ్రీ ఎంటర్‌ప్రైజెస్, ట్రస్ట్ ట్రేడర్స్, హిందుస్థాన్ ట్రేడర్స్ వంటి పలు సంస్థల పేర్లతో ఈ నకిలీ బిల్లులను తయారు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమంగా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొంది, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించడమే ఈ మోసం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది.

**విచారణలో కీలక అంశాలు**

ఈ కేసులో నేరగాళ్లు అనుసరించిన విధానం అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది. సాధారణంగా జరిగే మోసాల్లా నకిలీ జీఎస్టీ నంబర్‌ను సృష్టించకుండా, ఇప్పటికే వ్యాపారం చేస్తున్న అసలైన సంస్థ ఖాతానే లక్ష్యంగా చేసుకున్నారు. ఖాతాను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, దాని ద్వారా భారీగా నకిలీ లావాదేవీలు జరిపారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఎవరున్నారు? ఈ ఫేక్ బిల్లుల ద్వారా ఎంత మొత్తం క్లెయిమ్ చేశారు? వాస్తవంగా ప్రభుత్వానికి ఎంత నష్టం వాటిల్లింది? అనే కోణాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఓ వ్యవస్థీకృత సైబర్ ముఠా ప్రమేయం ఉన్నట్లు బలంగా అనుమానిస్తున్నారు.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమే: టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## హైదరాబాద్‌లో విషాద ఘటన.. ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య

**హైదరాబాద్‌లో ఎంబీబీఎస్ విద్యార్థిని ఆత్మహత్య**

**నీట్ పీజీ కోసం సిద్ధమవుతున్న యశ్విత గుర్తింపు**

**ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద ఘటన.. కేసు నమోదు చేసిన పోలీసులు**

**మృతురాలు కర్నూలుకు చెందిన వ్యాపారి ఏకైక కుమార్తె**



హైదరాబాద్‌లో విషాదం చోటుచేసుకుంది. నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్న ఓ వైద్య విద్యార్థిని శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో, మృతురాలిని కర్నూలుకు చెందిన వ్యాపారి రామ్మోహన్ రెడ్డి ఏకైక కుమార్తె యశ్వితగా పోలీసులు గుర్తించారు. యశ్విత గత ఆరు నెలలుగా హైదరాబాద్‌లో నివాసమంటూ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్ కోసం శిక్షణ పొందుతోంది. శనివారం ఆమె తాను బస చేస్తున్న గదిలోనే బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న చిక్కడపల్లి పోలీసులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యశ్విత ఆత్మహత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, విచారణ కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఏకైక కుమార్తె మృతితో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.

# సమర్థవంతమైన నాయకుడిని డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నుకోండి

**ఎల్బీనగర్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్సీ పీవీ మోహన్**

**డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం మధుయాష్కి గౌడ్ ఆధ్వర్యంలో ఎల్ బీ నగర్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశం.. హాజరైన పరిశీలకులు**




ఎల్బీనగర్ ఆగస్టు 30 (వాయిస్ టుడే): సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం- రంగారెడ్డి జిల్లా నూతన డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కర్మన్ ఘట్ లోని ఎన్-విలేజ్ కన్వెన్షన్ లో నిర్వహించడం జరిగింది. ఏఐసీసీ పరిశీలకులు, కర్ణాటక ఎమ్మెల్సీ పీవీ మోహన్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా.. జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి , టీపీసీసీ పరిశీలకులుగా టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి , టీపీసీసీ జనరల్ సెక్రెటరీ పీవీ శ్రీనివాస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీవీ మోహన్ మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా దేశంలోనే ఆర్థికంగా నెంబర్ వన్ జిల్లా అన్నారు. దేశంలోనే ఫర్ క్యాప్టా అధికంగా ఉందని వివరించారు. అలాంటి రంగారెడ్డి జిల్లాకు సమర్థవంతమైన నేతను డీసీసీ అధ్యక్షులుగా ఎన్నుకోవాలన్నారు. ఓట్ చోరీ తోనే బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో, పోలింగ్ ముగిసిన తర్వాత అనూహ్యంగా ఓటింగ్ శాతం పెరిగిందన్నారు. ఎస్ఐఆర్ తో బీజేపీ లబ్ధి పొందుతుందని, మన పార్టీ బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయడం చాలా ముఖ్యమన్నారు. అందుకే బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ బలపడాలి అంటే సమర్థవంతమైన డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ గారిని ప్రధాని చేసే లక్ష్యంగా పనిచేసే నాయకుడికి అవకాశం ఇవ్వాలని సూచించారు.

మధుయాష్కి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే పార్టీని, కార్యకర్తలను మోసం చేసి, ఇతర పార్టీలోకి వెళ్ళినప్పటికీ.. మళ్లీ పార్టీని బలోపేతం చేయడంలో కార్యకర్తలు కృషి చేస్తున్నారన్నారు. ఎంపీగా రేవంత్ రెడ్డిని గెలిపించేందుకు ఎంతో శ్రమించారని వివరించారు. డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి కార్యకర్తలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేయాలని సూచించారు. తనకు రాజకీయ వారసులు ఎవరు లేరని, పార్టీ నాయకులు, కార్యకర్తలే తన వారసులని పేర్కొన్నారు. ఏఐసీసీ పరిశీలకులుగా వచ్చిన పీవీ మోహన్ కేరళలో ఇన్చార్జిగా పనిచేసి ఆ రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సమర్థవంతంగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ లో భాగంగా 1,87, 000 ఓట్లు నో మ్యాపింగ్ లో ఉన్నాయని, నోటీసులు అందుకునేవారు సంబంధిత వివరాలు అందజేసేలా ప్రతి కార్యకర్త, బీఎల్ఏలు పనిచేయాలని సూచించారు. డాక్టర్ మట్టా రాగమయి పటేల్ రమేష్ రెడ్డి శ్రీనివాస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ లు మాట్లాడుతూ.. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ, అందరినీ కలుపుకొని పోయి కష్టపడి పనిచేసే వారిని డీసీసీ అధ్యక్ష పదవికి ప్రతిపాదించాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడి రాజీనామా

నాచారం (వాయిస్ టుడే): అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఏడల గణేష్ తన పదవికి రాజీనామా చేశారు. తన పదవీకాలం ముగియడంతో 30-08-2026న కమిటీ సభ్యులు, సంఘ సభ్యుల సమక్షంలో అధ్యక్ష పదవితో పాటు కమిటీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధికి సహకరించిన కమిటీ సభ్యులు, సంఘ సభ్యులకు గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అరుంధతి సంక్షేమ సంఘం సభ్యులు, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## దివ్యాంగుల ఫోరంకు 'భారత్ కళా వైభవ్--2026' అవార్డు

నాచారం (వాయిస్ టుడే): విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరంకు 'భారత్ కళా వైభవ్--2026' రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ధూమ్ ధామ్--దమ్ము నీదా? నాదా?' డాన్స్ కాంపిటీషన్ కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. దివ్యాంగుల సంక్షేమం, హక్కులు, విద్య, ఉపాధితో పాటు సాంస్కృతిక, సామాజిక సేవా రంగాల్లో ఫోరం చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. డాక్టర్ ఎండీ ఆరిఫ్ వుద్దీన్ చేతుల మీదుగా ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నకరకంటి అశోక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ అవార్డును అందుకున్నారు.

ఈ సందర్భంగా నకరకంటి అశోక్ మాట్లాడుతూ.. దివ్యాంగుల హక్కుల సాధన కోసం ఫోరం చేస్తున్న నిరంతర కృషికి ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచిందన్నారు. దివ్యాంగ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విద్య, ఉద్యోగం, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మారవేణి చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. దివ్యాంగుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజం మొత్తం బాధ్యత అన్నారు. వారి కళా, సాంస్కృతిక ప్రతిభకు మరిన్ని వేదికలు కల్పిస్తామని తెలిపారు. అవార్డు దివ్యాంగుల హక్కుల ఉద్యమానికి మరింత స్ఫూర్తినిస్తుందని ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు.

## ఎన్టీఆర్‌నగర్ MRPS యువజన కమిటీ ఎన్నిక



నాచారం (వాయిస్ టుడే): ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (MRPS) నూతన యువజన కమిటీ ఎన్నిక, ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్ ఆధ్వర్యంలో, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరపాక అంజి మాదిగ నాయకత్వంలో కార్యక్రమం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి, అనంతరం వారిని సన్మానించారు. మల్లాపూర్ ఎన్టీఆర్‌నగర్ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు చేవెళ్ల రమేష్, ప్రధాన కార్యదర్శి గొల్లూరి సోములు, ఉపాధ్యక్షుడు బొల్లారం యాదగిరి తదితరులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

**నూతన కమిటీ:** అధ్యక్షుడిగా గొల్లూరి రవి, ఉపాధ్యక్షుడిగా బొల్లారం మనోజ్, ప్రధాన కార్యదర్శిగా చేవెళ్ల సాయి శశాంక్, జాయింట్ సెక్రటరీగా బొల్లారం విగ్నేష్, సలహాదారుగా మదాస్ అజయ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కర్రె ఉదయ్, మద్దూరి కిరణ్, సన్నీ, సిరియాల కుమార్, శ్యామల సాయి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ మాదిగల హక్కుల సాధనతో పాటు ఎన్టీఆర్‌నగర్ పరిధిలో దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీ౯రూ నాయకులు, దళిత సంక్షేమ సంఘం ప్రతినిధులు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## నూతన వధూవరులు వినయ్ కుమార్--మౌనికలకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు

ఖమ్మం: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు లిలివద్దిరాజు రవిచంద్రలిలి నూతన వధూవరులు లిలివినయ్ కుమార్--మౌనికలిలిలను ఆశీర్వదించారు. ఎంపీ రవిచంద్ర సన్నిహితులు, కేసముద్రం వాస్తవ్యులు లిలిచందా గోపీలిలి మేనకోడలు, స్వర్గీయ మదూరి సంగయ్య--కళావతి దంపతుల ఏకైక కుమార్తె లిలిమౌనికలిలి వివాహం, కొత్తగూడెం రామవరం కాలనీ వాస్తవ్యులు లిలిబీరెల్లి దామోదర్--సునీతలిలి దంపతుల ఏకైక కుమారుడు లిలివినయ్ కుమార్లిలితో ఆదివారం ఘనంగా జరిగింది. ఖమ్మం--బోనకల్ రోడ్డులోని లిలికొత్తూరు ఎంఎంఆర్ ఫంక్షన్ హాల్లిలిలో నిర్వహించిన వివాహ వేడుకకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. నూతన వధూవరులు వినయ్ కుమార్--మౌనికలకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఎంపీ రవిచంద్ర ఆకాంక్షించారు.

## నూతన వధూవరులు దీప్తి-వీరబాబులకు ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



ఖమ్మం: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నూతన వధూవరులు దీప్తి--వీరబాబులను ఆశీర్వదించారు. తిరుపతిరావు--ఇందిర దంపతుల కనిష్ఠ కుమార్తె దీప్తి వివాహం, స్వర్గీయ మలప నాగేశ్వరరావు--మంగమ్మ దంపతుల జ్యేష్ఠ కుమారుడు వీరబాబుతో ఆదివారం ఘనంగా జరిగింది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కోయచెలకలోని కేపీఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వివాహ వేడుకకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరయ్యారు. నూతన వధూవరులు దీప్తి--వీరబాబులకు అక్షింతలు వేసి తన ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని ఎంపీ రవిచంద్ర ఆకాంక్షించారు.



## సామాజిక సేవలో కాసుల మల్లికార్జున్‌కు గౌరవ డాక్టరేట్

హైదరాబాద్, ఆగస్టు 30: సమాజ హితం కోసం విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త కాసుల మల్లికార్జున్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి అమెరికా (న్యూజెర్సీ)లోని 'యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. పుదుచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కె. వెంకటేశన్ మాట్లాడుతూ.. సమాజం పట్ల నిబద్ధతతో నిస్వార్థ సేవలు అందించే వారికి ఎల్లప్పుడూ సముచిత గుర్తింపు, గౌరవం లభిస్తాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నర్సింహా గౌడ్ మాట్లాడుతూ.. సామాజిక సేవ, విద్య, వైద్యం, కళలు, సైన్స్ తదితర రంగాల్లో విశేష కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం జరుగుతోందని తెలిపారు. గౌరవ డాక్టరేట్ పొందిన అనంతరం కాసుల మల్లికార్జున్ ఆదివారం కాచిగూడలో మీడియాతో మాట్లాడారు. తన సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని అందించిన యూనివర్సిటీ ప్రతినిధులకు, రీజినల్ జాయింట్ డైరెక్టర్ గౌని నర్సింహా గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులకు, సేవా కార్యక్రమాల్లో నిరంతరం భాగస్వాములవుతున్న తోటి స్వచ్ఛంద కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## సెప్టెంబర్ 1న ఘనంగా స్వాతంత్ర్య సమరయోధుడు కేసీ గుప్త 107వ జయంతి వేడుకలు

**రాంకోఠి జైన్ భవన్‌లో ఏర్పాట్లు పూర్తి**

**ముఖ్య అతిథులుగా అమరవాది లక్ష్మీనారాయణ, డీఐజీ దుద్దేళ్ల శ్రీనివాస్**

**జయంతి సందర్భంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు: నిర్వాహకులు**



హైదరాబాద్, ఆగస్టు 30: హైదరాబాద్ విమోచన పోరాటంలో కీలకపాత్ర పోషించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, వాసవీ ఉద్యమ పితామహుడు దివంగత కల్వకుంట్ల చంద్రసేన గుప్త (కే.సి. గుప్త) 107వ జయంతి వేడుకలను సెప్టెంబర్ 1వ తేదీన ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్యవైశ్య సంఘం ఇసామియా బజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్త, ప్రాజెక్టు అడ్వైజర్ కొమిరిశెట్టి అనిల్ కుమార్ వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 1న నగరంలోని రాంకోఠి పరిధిలో గల శ్రీ జైన్ భవన్‌లో ఈ జయంతి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, హైదరాబాద్ సంస్థాన విముక్తి కోసం కేసీ గుప్త చేసిన పోరాటం, త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. వాసవీ క్లబ్స్ వ్యవస్థాపన ద్వారా సమాజ సేవకు నూతన దిశానిర్దేశం చేసిన మహనీయుడని, ఆయన ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు శ్రీ అమరవాది లక్ష్మీనారాయణ, డీఐజీ శ్రీ దుద్దేళ్ల శ్రీనివాస్ (ఐపీఎస్) లతో పాటు పలువురు సామాజిక, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. కల్వకుంట్ల చంద్రసేన గుప్త జయంతిని పురస్కరించుకుని పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, కుల బాంధవులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సంఘం ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.



## డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో.. బూత్ ఏజెంట్లకు ఎస్ఐఆర్-2పై అవగాహన

నాచారం (వాయిస్ టుడే): మాణిక్యేశ్వరి నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి గండికోట కుమార్ ఆధ్వర్యంలో బూత్ నంబర్లు 210 నుంచి 217 వరకు ఉన్న బూత్ ఏజెంట్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఫేజ్-2 ఓటరు జాబితా నమోదు, సవరణ ప్రక్రియపై ఏజెంట్లకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని గండికోట కుమార్ సూచించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హత ఉన్నవారి వివరాల పరిశీలన తదితర అంశాలపై బూత్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆయా బూత్‌లకు చెందిన కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 31 ఆగస్టు 2026



## ఆర్.కే. చౌదరి ఫ్యామిలీ రెస్టారెంట్, గార్డెన్ దాబా ప్రారంభం

### ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు లిలివద్దిరాజు రవిచంద్రలిలి ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం లిలిబూడిదంపాడులో ఆర్.కే. చౌదరి ఫ్యామిలీ రెస్టారెంట్, గార్డెన్ దాబాలిలి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రిబ్బన్ కట్ చేసి, కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం లిలిఆర్.కే. చౌదరి, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేటర్ గోవాడ గుణచరిత్లిలి తదితరులతో కలిసి రెస్టారెంట్, గార్డెన్ దాబాను ప్రారంభించారు. అనంతరం ఆర్.కే. చౌదరి దంపతులను ఎంపీ రవిచంద్ర శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రెస్టారెంట్, దాబా కస్టమర్ల మన్ననలు పొందుతూ మంచి పేరు సంపాదించి, విజయవంతంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, ఆర్.కే. చౌదరి కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల సమస్యలే పోరాటాల అజెండా కావాలి

### కార్మిక-రైతు-దళిత-బహుజన ఐక్యతను బలోపేతం చేయాలని రెడ్ స్టార్ నిర్ణయం

వరంగల్, ఆగస్టు 30: ప్రజల జీవనోపాధి, ఉపాధి, భూమి, విద్య, వైద్యం, సామాజిక న్యాయం వంటి మౌలిక సమస్యలపై విస్తృత ప్రజా ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ బాడీ సమావేశం పేర్కొంది. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం రాష్ట్ర నాయకులు మండల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలు, పార్టీ విస్తరణ తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ భాషా మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, కార్పొరేట్ ఆధిపత్యం, మతతత్వ రాజకీయాల నేపథ్యంలో ప్రజాస్వామిక శక్తులు మరింత సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నిత్యజీవిత సమస్యలపై ఉద్యమాల ద్వారానే విస్తృత ప్రజా ఐక్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, బహుజనులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటాలు సాగించాలని సమావేశం నిర్ణయించింది. కుల, మత విద్వేషాలకు తావులేకుండా సామాజిక ఐక్యతను బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. రాయచూరులో జరగనున్న పార్టీ 13వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని తీర్మానించారు. సమావేశంలో గోగర్ల శంకర్, సురుగు ప్రభాకర్, గడ్డం శరత్, ఎం.ఏ. పాషా, రైతు సమితి నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ముగింపులో విప్లవ నినాదాలు, పోరాట గీతాలతో సమావేశం ముగిసింది.



## ఐక్య ఉద్యమాలతో బీసీలు రాజకీయంగా ఎదగాలి

### డాక్టర్ కూరపాటి రమేష్

తొర్రూరు, ఆగస్ట్ 30 వాయిస్ టుడే : సమాజంలో 80 శాతానికి పైగా ఉన్న బీసీ,ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం సాధించాలని కూరపాటి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కూరపాటి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో వివిధ బీసీ సంఘాల ఎస్సీ,ఎస్టీ సంఘాలతో కలిపి జరిగిన ఐక్య సమావేశం బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ అధ్యక్షతన జరిగింది. బీసీ ఇంటలె క్చువల్స్ ఫోరం ఆధ్వర్యంలో సబ్బండ కులాల ఐక్యవేదిక నాయకుల సహకారంతో ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ వర్గాలందరూ 90 శాతం కలిగిన వారు ఒకే భావజాలాన్ని కలిగి ఉండి ఏకతాటిపై ఉండి నిర్మాణం చేసినట్లయితే భవిష్యత్తులో బీసీల బహుజనుల రాజ్యాధికారము సాధించవచ్చునని, మనమెంతో మనకంత వాటాను భవిష్యత్తులో అన్ని స్థాయిలలో తీసుకునే అవకాశం ఉంటుందని రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ లు హాస్పిటల్స్ వైద్య రంగాలు సం సంక్షేమ రంగాలలో అసమానతలు అన్ని రకాలుగా నిర్వీర్యమైపోయాయని బడుగు బలహీన వర్గాల బహుజనులకు అందుబాటులో లేవని ఈ పాలకుర్తి నియోజకవర్గం గత స్వాతంత్రం నుండి అగ్రవర్ణాల చేతిలోనే ఉండి వారి ఆధీనంలోనే అణచివేత ధోరణితో బిసి బహుజన్ లను ఎదగా నివ్వకుండా వారు చెప్పు చేతుల్లోనే ఉంచుకుంటూ అందర్నీ బానిసలుగా రాజకీయ చైతన్యం లేకుండా చేశారని వాపోయారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, జేఏసీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కూరపాటి రమేష్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చందా మల్లయ్య, చైర్మన్ బీసీ ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా దామెర ఉపేందర్, జేఏసీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ బీసీ దళపతి, కార్యక్రమ ఆహ్వాన సంఘం కన్వీనర్ వెంకన్న గౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు ప్రవీణ్ రాజు, చామకూరి ఐలయ్య,సిరి స్వచ్ఛంద సంస్థ శ్రీనివాస్,దళిత నాయకుడు అయిలయ్య, కోట వెంకటేశ్వర్లు, రాంపాక సుధాకర్, దొనక ఐలయ్య, రాయిశెట్టి ఉపేందర్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

# బోనాల పండుగలు ఐక్యతకు ప్రతీకలు

### యువత ఆవేశాలకు, ఈగోలకు దూరంగా ఉండాలి

### అమ్మవారి ఆశీస్సులు అన్ని వర్గాల ప్రజలందరికి ఉండాలి

### రాగన్న దర్వాజ పోచమ్మ బోనాలు,పలారం ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని



హనుమకొండ, ఆగస్టు 30(వాయిస్ టుడే):లి రాగన్న ద్వారజా పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా పాలరాంబండి గ్రామంలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగలు ప్రతీకలని అన్నారు. ప్రతి ఏటా ప్రజలంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. యువత ఆవేశానికి, ఈగోలకు, కక్షలకు లోనై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎమ్మెల్యే సూచించారు. చిన్న తప్పిదం కూడా ఒక వ్యక్తి జీవితంతో పాటు కుటుంబం మొత్తం తీవ్రంగా నష్టపోయే పరిస్థితికి దారితీస్తుందని హెచ్చరించారు. పండుగలను ఆనందంగా జరుపుకుంటూనే సమాజంలో పరస్పర సోదరభావం, శాంతి, ఐక్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవిస్తే సమాజంలో ప్రశాంతత నెలకొంటుంది. యువత చెడు అలవాట్లకు, ఆవేశాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తు కోసం కష్టపడాలి. యువతలో, ప్రజల్లో సానుకూల మార్పు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలి అని ఎమ్మెల్యే అన్నారు.

మన ఆచారాలు, సంప్రదాయాలను కాపాడుకుంటూ వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, సుఖసంతోషాలు కలగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు విష్ణు రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, నాయకులు తోట పవన్, కానుగంటి శేఖర్, బోనాల నిర్వాహకులు అరవింద్ అక్కెనపల్లి, సుశీల్ మాడిశెట్టి, అఖిల్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి.. హిందువులపై వేధింపులు ఆపాలి

### ఎమ్మెల్యే ఆంధ్రా అల్లుడికి వత్తాసు పలుకుతున్న సీఐని వెంటనే సస్పెండ్ చేయాలి

### రాజకీయాలకు అతీతంగా ప్రతి హిందువు కోసం బిజెపి పోరాడుతుంది

### బిజెపి రాష్ట్ర నాయకురాలు రావు పద్మా రెడ్డి

హనుమకొండ, ఆగస్టు 30(వాయిస్ టుడే): "ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ పండుగలను స్వేచ్ఛగా జరుపుకునే రాజ్యాంగ హక్కు ఉంది, కానీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో హిందూ పండుగల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడమే కాకుండా, రాత్రికి రాత్రే అర్థరహితంగా అరెస్టులు చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయం" అని బిజెపి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు రావు పద్మ రెడ్డి మండిపడ్డారు. బోనాల పండుగ సందర్భంగా రాగన్న దర్వాజ ప్రాంతానికి చెందిన హిందూ యువకులను అక్రమంగా అరెస్టు చేశారు అనే విషయం తెలుసుకున్న రావు పద్మా రెడ్డి, బిజెపి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను ల సంతోష్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ తో కలిసి హనుమకొండ పోలీస్ స్టేషన్‌కి చేరుకొని సీఐ నీ ప్రశ్నించి పోలీసుల వైఖరిపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన బన్నీ, బంటి, రాహుల్ లను అక్కడికక్కడే విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. అర్ధరాత్రి వేళల్లో తండ్రి దొరక్కపోతే కొడుకును, కొడుకు దొరక్కపోతే తండ్రిని అరెస్ట్ చేయడం ఏ రకమైన రాక్షస పాలనో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా రావు పద్మ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి అసలు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారా? అని ప్రశ్నించారు. "ఎమ్మెల్యేను మేము గౌరవిస్తాం కానీ ఎమ్మెల్యే ఆంధ్రా అల్లుడి పెత్తనం ఏంటి? ఆయన చెప్పారని హనుమకొండ సీఐ ఒక పక్షానికే కొమ్ము కాస్తూ, హిందూ యువకులను వేధిస్తూ నిరంకుశంగా ప్రవర్తించడం సరికాదు. ఎమ్మెల్యే అల్లుడికి వత్తాసు పలుకుతున్న హనుమకొండ సీఐ ని వెంటనే సస్పెండ్ చేయాలి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్ఎస్, కాంగ్రెస్ అనీ రాజకీయాలకు అతీతంగా ప్రతి హిందువు హక్కుల కోసం, పండుగలను స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుపుకోవడం కోసం తాము ఎప్పుడూ ముందుండి పోరాడతామని స్పష్టం చేశారు. ప్రశాంతంగా ఉండే వరంగల్ వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని, ఇలాంటి నిరంకుశ చర్యలు ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

## అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు శ్రీకారం

### కుమ్మరిగూడెం, తరాలపల్లి గ్రామాల్లో రూ.1.40 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు

### నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి

### నియోజకవర్గంలో దశలవారీగా అభివృద్ధి పనుల అమలు



కాజీపేట, ఆగస్టు 30 (వాయిస్ టుడే): వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 45వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు ఆదివారం శ్రీకారం చుట్టారు. కుమ్మరిగూడెం, తరాలపల్లి గ్రామాల్లో రూ.1.40 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు మాట్లాడుతూ గతంలో కాలనీల్లో సరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రస్తుతం కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను వేగంగా చేపడుతున్నామని అన్నారు. చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు అభివృద్ధి పనులను దశలవారీగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మెరుగైన రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 45వ డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి, 44వ డివిజన్ అధ్యక్షులు జక్కుల సదానందం, 46వ డివిజన్ అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పుల్యాల యాదవ రెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, మాజీ డివిజన్ అధ్యక్షులు సట్ల సదానందం గౌడ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మంద రమేష్, జిల్లా బీసీ సెల్ నాయకులు గంగపురం వేణు గౌడ్, మహిళా డివిజన్ అధ్యక్షులు నర్మెట కృష్ణవేణి, జ్యోతి అమర్నాథ్, గ్రామ శాఖ అధ్యక్షులు బషీర్, వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బస్కె ప్రణయ్, మండల యూత్ అధ్యక్షులు కృష్ణ, దాసరి కార్తీక్, అజయ్, గంగపురం ఉదయ్, రవి, రాజు యాదవ్, సీనియర్ నాయకులు యాదగిరి యాదవ్, వేణు యాదవ్, స్వామి, బైరి విశ్వనాథం, దుబ్బాక మోహన్, రాజశేఖర్, ఆరూరి పరమేష్, ఆరూరి సురేష్, ఐలపాక రాజేష్, సదారపు బాలకృష్ణతో పాటు యూత్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజు తదితర ప్రముఖులతో కలిసి స్వర్గీయ దేవేంద్రనాథ్‌కు ఘన నివాళి





ఖమ్మం: బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రతో పాటు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తమరావు, ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, సంఘం ఖమ్మం జిల్లా గౌరవాధ్యక్షులు కొత్త సీతారాములు, మాజీ అధ్యక్షులు పారా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్ తదితర ప్రముఖులు స్వర్గీయ పొదిల దేవేంద్రనాథ్ పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త లిలిపొదిల రవికుమార్లిలి తండ్రి దేవేంద్రనాథ్ శనివారం ఉదయం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలు ఆదివారం ఉదయం ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం లిలిఖానాపురంలిలి స్వగ్రామంలో నిర్వహించారు.

దేవేంద్రనాథ్ మృతి వార్త తెలియగానే ఢిల్లీలో ఉన్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హుటాహుటిన ఖానాపురం చేరుకున్నారు. దేవేంద్రనాథ్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆకుల గాంధీ, పారా నాగేశ్వరరావు తదితర ప్రముఖులతో కలిసి అంతిమయాత్రలో పాల్గొన్నారు. పార్థివదేహాన్ని ఉంచిన పాడెను మోసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం ప్రముఖులు లిలిచెరుకూరి శేషగిరిరావు, పసుపులేటి వెంకట్, కాశిని శ్రీనివాసరావు, జి.వి.ఎల్. నర్సింహారావు, జయప్రకాష్, ఆకుల సురేష్, సుంకర చిరంజీవి, నానబాల హరీష్, హారిక, శ్రీదేవిలిలి తదితరులు దేవేంద్రనాథ్ పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుమారుడు రవికుమార్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. దేవేంద్రనాథ్ కుటుంబానికి ఈ కష్ట సమయంలో అండగా ఉంటామని పేర్కొన్నారు.





# కాజీపేటలో ఘనంగా శ్రావణ మాసం బోనాల ఉత్సవాలు

**పోచమ్మ గుడుల్లో ఉదయం నుంచే బారులుతీరి మొక్కలు సమర్పించిన భక్తులు**

**బోనం ఎత్తిన మహిళలు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు**

**15 ఏళ్లుగా కొంద్ర మిత్రమండలి ఆధ్వర్యంలో పలారం బండి**

**బాపూజీనగర్ పోచమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసిన దాస్యం వినయ్ భాస్కర్**

కాజీపేట, ఆగస్టు 30(వాయిస్ టుడే): శ్రావణ మాసం బోనాల పండుగను కాజీపేట, వడ్డేపల్లి, మడికొండ ప్రాంతాలతో పాటు పరిసర కాలనీల్లో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని పోచమ్మ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం నుంచే మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య ఆలయాలకు చేరుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో పాటు ప్రాంతం సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

**బాపూజీనగర్‌లో ప్రత్యేక పూజలు..**

బోనాల పండుగకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ బాపూజీనగర్‌లోని పోచమ్మ గుడికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ప్రతి ఏటా సంప్రదాయంగా పలారం బండిని నిర్వహిస్తున్న కొంద్ర నర్సింగరావు ఇంటికి చేరుకున్నారు. అక్కడ పోతరాజుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం పలారం బండికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దాస్యం వినయ్ భాస్కర్ పలారం బండి ఊరేగింపును ప్రారంభించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, భక్తుల జయజయధ్వానాల మధ్య పలారం బండి ఊరేగింపు ఉత్సాహంగా సాగింది.

**15 ఏళ్లుగా పలారం బండి సంప్రదాయం**

కాజీపేటలోని కొంద్ర మిత్రమండలి ఆధ్వర్యంలో గత 25 ఏళ్లుగా పలారం బండి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా భక్తిశ్రద్ధలతో పలారం బండిని అలంకరించి ఊరేగించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కొంద్ర మిత్రమండలి నిర్వాహకులు కొంద్ర శంకర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, కాజీపేట ప్రాంతం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమిడి, బాపూజీనగర్, బాలాజీనగర్, భవానీనగర్, వెస్ట్ సిటీ, వడ్డేపల్లి, మడికొండ తదితర ప్రాంతాల్లోనూ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకుని ఆలయాలకు ఊరేగింపుగా తరలివెళ్లారు.

## రాష్ట్రపతి భవన్‌లో సిరిసిల్ల జిల్లా విద్యార్థుల సందడి

**89 మంది విద్యార్థుల బృందంలో దుమాల ఏకలవ్య పాఠశాల విద్యార్థిని కొర్ర కారుణ్య**




ఎల్లారెడ్డిపేట, ఆగస్ట్ 30 (వాయిస్ టుడే): ప్రతిభ కు పల్లె, పట్టణం అనే తేడా లేదని నిరూపించింది దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థి ని కొర్ర కారుణ్య. తన ప్రతిభ తో జాతీయ స్థాయి కార్యక్రమానికి ఎంపికై.. ఏకంగా రాష్ట్రపతి ని కలిసే అవకాశం దక్కించుకుంది. 2025 విద్యా సంవత్సరం లో నిర్వహించిన జాతీయ స్థాయి కార్యక్రమాల నేపథ్యం లో దేశం లోని వివిధ ప్రాంతాలకు చెందిన గిరిజన గురుకుల విద్యార్థులను ఎంపిక చేశారు. ఇందు లో 8 నుంచి 15 ఏళ్ల వయసున్న 89 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఎంపికైన విద్యార్థుల్లో కారుణ్య కూడా ఉండటం విశేషం. రాష్ట్రపతి భవన్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులు రాష్ట్రపతితో భేటీ అయ్యారు. తమ విద్యాభ్యాసం, ప్రతిభకు సంబంధించిన అంశాలను వివరించే అవకాశం పొందారు. విద్యార్థుల ప్రతిభను రాష్ట్రపతి అభినందించడంతో పాటు వారితో కలిసి ఫొటోలు దిగారు. ఇంత చిన్న వయసులోనే దేశ ప్రథమ పౌరుడిని కలుసుకోవడం కారుణ్యకు మరపురాని అనుభూతిగా మిగిలింది. దుమాల ఏకలవ్య పాఠశాలకు చెందిన విద్యార్థిని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# బడుగుల గొంతుకగా బీఎస్పీ పోరాటం

**వరంగల్‌లో నూతన జిల్లా కార్యాలయం ప్రారంభం**

**రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటుతాం.**

**అక్టోబర్ 9న హైదరాబాద్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ**

**బీఎస్పీ చీఫ్ జోనల్ ఇంచార్జ్ దాగిళ్ళ దయానంద రావు**



వరంగల్ ( వాయిస్ టుడే )ఆగస్టు 30: బడుగు, బలహీన, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే రాజకీయ శక్తి బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అని ఆ పార్టీ చీఫ్ జోనల్ ఇన్‌చార్జ్ దాగిళ్ల దయానందరావు అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బీఎస్పీ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఆదివారం వరంగల్ నగరంలోని కొత్తవాడ 80ఫిట్ల రోడ్ లో వరంగల్ జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు వనం మహేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన జిల్లా పార్టీ కార్యాలయాన్ని దాగిళ్ల దయానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దాగిళ్ల దయానందరావు మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మాయావతి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని అన్నారు. అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. అదే సిద్ధాంతాలను కొనసాగిస్తూ తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి బీఎస్పీ కృషి చేస్తోందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ వర్ధంతిని పురస్కరించుకుని అక్టోబర్ 9న హైదరాబాద్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు దాగిళ్ల దయానందరావు తెలిపారు. ఈ సభను విజయవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. వరంగల్ జిల్లా నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు సభకు తరలివచ్చేలా కృషి చేయాలని కోరారు. వరంగల్ జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు వనం మహేందర్ మాట్లాడుతూ పేదలకు ప్రధాన వైద్య కేంద్రంగా ఉన్న ఎంజీఎం ఆసుపత్రిలో వైద్య సేవలు, మౌలిక వసతుల పరిస్థితి అధ్వానంగా ఉందని విమర్శించారు. పేదలు, సామాన్య ప్రజలు వైద్యం కోసం ఎంజీఎంను ఆశ్రయిస్తున్నప్పటికీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. ఎంజీఎం సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరఫున బీఎస్పీ పోరాటం చేస్తుందని తెలిపారు. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులను బరిలో నిలిపి విజయం సాధించే దిశగా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తున్నామని వనం మహేందర్ అన్నారు. పేదలు, కార్మికులు, వెనుకబడిన వర్గాలు, అణగారిన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించే నాయకులకు ప్రజల మద్దతు లభిస్తుందని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఎస్పీ తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు రిటైర్డ్ ఎస్సైలు ఉపేందర్, గోపాలు బీఎస్పీలో చేరారు. వారికి పార్టీ నాయకులు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ బస్కే నాగరాజు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఎస్పీ తన సత్తా చాటుతుందని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రజల సమస్యలపై బీఎస్పీ మరింత బలంగా పోరాటం చేస్తుందని తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ములుగు జిల్లా అధ్యక్షుడు నరేష్‌తో పాటు సాదిక్, అనిల్, సాంబయ్య, లోకేష్, రజనీకాంత్, శేఖర్, సందీప్, ప్రవీణ్ కుమార్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే CBSR సుజాత సుబ్రహ్మణ్యం పదవీ విరమణ

**వేడుకలకు హాజరైన మజ్దూర్ యూనియన్ నాయకులు**



వరంగల్(వాయిస్ టుడే ) ఆగష్టు 30: రైల్వే CBSRలో విధులు నిర్వహించిన సుజాత సుబ్రహ్మణ్యం పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ (SCRMU) నాయకులు హాజరై ఘనంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పదవీ విరమణ అనంతరం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. ఆమె భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో నిండాలని మజ్దూర్ యూనియన్ నాయకులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్,కోశాధికారి సంగీత,అసిస్టెంట్ సెక్రెటరీ సురేష్, రాజేష్, వైస్ చైర్మన్ సుధాకర్, రాజేష్, రమేష్, నర్సింహా చారి,రాజు, మధులతో పాటు నాయకులు, కార్యకర్తలు, రైల్వే ఉద్యోగులు పాల్గొని సుజాత సుబ్రహ్మణ్యం దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



## తెలంగాణ ఉద్యమకారుల రాజన్న సిరిసిల్ల జిల్లా జేఏసీ చైర్మన్‌గా గజ్జెల దేవరాజ్

సిరిసిల్ల, ఆగస్టు 30 (వాయిస్ టుడే): తెలంగాణ ఉద్యమ కారుల రాజన్న సిరిసిల్ల జిల్లా జేఏసీ చైర్మన్ గా గజ్జెల దేవరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా జేఏసీ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులు సమావేశమై నూతన కమిటీ ఏర్పాటు పై చర్చించారు. అనంతరం చైర్మన్ గా గజ్జెల దేవరాజ్ పేరు ను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భం గా గజ్జెల దేవరాజ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఉద్యమకారులకు ప్రభుత్వం అందించాల్సిన హక్కులు, సంక్షేమ పథకాలు, గౌరవాన్ని సాధించేందుకు జేఏసీ తరపున నిరంతరం పోరాడు తామని అన్నారు. జిల్లా వ్యాప్తం గా ఉద్యమకారులను ఏకతాటి పైకి తీసుకువచ్చి వారి సమస్య లను ప్రభుత్వం దృష్టి కి తీసుకెళ్ల నున్నట్లు పేర్కొన్నారు. గజ్జెల దేవరాజ్ ఎన్నిక పై తెలంగాణ ఉద్యమకారులు, జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.



## రాజన్న సిరిసిల్ల జిల్లా లో మోగిన 'రైలు కూత'

**బస్వాపూర్ వరకు విజయవంతం గా ట్రయల్ రన్**

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్ట్ 30 (వాయిస్ టుడే):కొత్తపల్లి–మనోహరాబాద్ నూతన రైల్వే లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా, జిల్లా సరిహద్దు లోని తంగళ్ళపల్లి మండలం బస్వాపూర్ రైల్వే స్టేషన్ వరకు నిర్వహించిన రైల్వే ట్రయల్ రన్ విజయవంతమైంది. తొలిసారి గా జిల్లా సరిహద్దు ప్రాంతం లోకి రైలు వచ్చి కూత పెట్టడంతో స్థానిక ప్రజలు, రైతులు ఆనందంలో మునిగిపోయారు. సిద్దిపేట మార్గం నుంచి బస్వాపూర్ స్టేషన్ వరకు రైల్వే అధికారులు ఇంజిన్‌ను నడిపి పట్టాలు, సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దశాబ్దాలు గా రైలు సౌకర్యం కోసం నిరీక్షిస్తున్న గిరిజన, గ్రామీణ ప్రాంత ప్రజలు రైలు రాకను చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రైల్వే అధికారులకు పటాకులు కాల్చి, మిఠాయిలు తినిపించి స్వాగతం పలికారు. ఈ మార్గం పూర్తి స్థాయి లో అందుబాటులోకి వస్తే సిరిసిల్లలోని చేనేత, జౌళి ఉత్పత్తుల రవాణాకు కొత్త ఊపిరి అందడమే కాకుండా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు రవాణా కష్టాలు తప్పనున్నాయి.

## రోడ్డుపై సంత... ప్రమాదాల ముప్పు!

**లారీ బంపర్ తగిలి ఎక్సెల్ బండి దారుడికి గాయాలు.. తృటిలో తప్పిన ప్రాణాపాయం**

ముస్తాబాద్, ఆగస్టు 30(వాయిస్ టుడే): ముస్తాబాద్ లో రోడ్డుపైనే కూరగాయల సంత నిర్వహిస్తుం డటంతో తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదివారం ముస్తాబాద్ కు చెందిన డబ్బేడ రాములు ఎక్సెల్ బండి పై ధన్వంతరి ఎక్స్ సెంటర్ లోకి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. దుబ్బాక రోడ్డు నుంచి తెలంగాణ ప్రధాన చౌక్ మీదుగా కామారెడ్డి రోడ్డువైపు వెళ్తున్న లారీ బంపర్ ఎక్సెల్ బండి కి తగలడం తో రాములు గాయపడ్డారు. ప్రమాదం లో తృటి లో ప్రాణాపాయం తప్పింది.

**రోడ్డు పైనే కూరగాయల సంత..**

ప్రతి ఆదివారం నిర్వహించే కూరగాయల సంత లో కొంత భాగాన్ని మూసివేసి, మరోవైపు ప్రధాన రహదారి పైనే సంత నిర్వహిస్తుండటం తో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొనుగోలుదారులు, వ్యాపారులు రోడ్డు పైకి రావడం తో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి దీంతో ప్రధాన చౌక్ పరిసరాల్లో తరచూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.

**పలుమార్లు ప్రమాదాలు.**

రోడ్డు పై సంత కారణం గా వాహనదారులు ఇబ్బందులు పడటంతోపాటు గతంలోనూ పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించకముందే అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. కూరగాయల సంతను ప్రధాన రహదారికి దూరంగా, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగని ప్రాంతంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
సోమవారం 31 ఆగస్టు 2026



## వేములవాడ పట్టణ కాంగ్రెస్ నూతన కమిటీ నియామకం

**-ఆది శ్రీనివాస్ నాయకత్వంలో పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేస్తాం : తుమ్ మధు**

వేములవాడ, ఆగస్టు 30 (వాయిస్ టుడే): వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని పట్టణ అధ్యక్షుడు తుమ్ మధు ఆదివారం నియమించారు. ఈ సందర్భం గా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భం గా తుమ్ మధు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వం లో, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ఆదేశాల మేరకు పార్టీ ని క్షేత్ర స్థాయి లో మరింత బలోపేతం చేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నూతన కమిటీ నాయకులు కృషి చేయాలని సూచించారు.నూతన కమిటీ నాయకులందరూ సమన్వయం తో, కలిసి కట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తామని తుమ్ మధు తెలిపారు. నూతన కమిటీ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



## శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

**మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

వేములవాడ, ఆగస్టు 30 (వాయిస్ టుడే):రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధం గా ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం లో ఆదివారం సెలవు దినం సందర్భం గా భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే ఆలయానికి పెద్ద సంఖ్య లో భక్తులు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు కొబ్బరికాయలు సమర్పించగా, మరికొందరు ప్రదక్షిణలు చేసి కుటుంబ సభ్యుల శ్రేయస్సు, ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయంలో నిర్వహించిన అర్చనలు, హారతుల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.భక్తుల రద్దీకి అనుగుణంగా దేవస్థాన అధికారులు క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాద పంపిణీ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో దర్శనం ప్రశాంతం గా కొనసాగింది.ఆదివారం కావడం తో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారి, స్వామివారి దర్శనం అనంతరం భక్తులు ప్రసాదం స్వీకరించి ఆధ్యాత్మిక ఆనందంతో తిరుగు ప్రయాణమయ్యారు.




## నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి కుమ్మరి బిక్షపతి

నర్సాపూర్ (వాయిస్ టుడే) : హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామానికి చెందిన అల్లంకి ప్రభాకర్ కుమారుడి వివాహము మంగాపూర్ శివారులో గల ఎస్ ఎస్ ఆర్ గార్డెన్ లో జరిగిన ఈ వివాహానికి నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బిక్షపతి పాల్గొని వారిని ఆశీర్వదించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో పిల్లాపాపలతో చల్లగా ఉండాలని ఆయన తెలిపారు ఆయన వెంట గ్రామ పంచాయతీ సభ్యులు రాజశేఖర్ మాజీ వార్డ్ మెంబర్ శంకర్ కిషన్ రాజు శేఖర్ సాయిబాబా అనిల్ మోహన్ విజయ్ కుమార్ నరేష్ పవన్ తదితరులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

తిప్పర్తి ఆగష్టు 30(వాయిస్ టుడే): తిప్పర్తి మండలం చిన్నాయగూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకు లు బైరగోని శ్రీనివాస్ గౌడ్ రాజేశ్వరి కుమార్తె స్వాతి మహేష్ గౌడ్ వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బియర్స్ జిల్లా నాయకులు మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి జేరిపోతుల సైదులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు తిప్పర్తి మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# సుంక్లి గ్రామంలో అన్న బాహు సాఠే విగ్రహం ఆవిష్కరణ

## సుంక్లి గ్రామ అభివృద్ధికి ప్రత్యేక కృషి ఎమ్మెల్యే శ్రీ రామారావు పటేల్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 30: భైంసా మండలం సుంక్లి గ్రామంలో సాహిత్య సామ్రాట్ శ్రీ అన్న బాహు సాఠే జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన అన్న బాహు సాఠే విగ్రహాన్ని ముధోల్ శాసనసభ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నభౌ సాఠే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన రచనలు, కవితల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు.అన్న బాహు సాఠే రచనలు సామాజిక అసమానతలపై పోరాటానికి స్ఫూర్తినిచ్చాయని, అణగారిన వర్గాల హక్కుల సాధనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు.సుంక్లి గ్రామ అభివృద్ధికి ఇప్పటికే సుమారు రూ.80 లక్షల వరకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. రానున్న రోజుల్లో బిజ్జూర్ నుండి పెంచికల్ పాడ్ వయ సుంక్లి బీటీ రోడ్డు, మరియు వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తామని అలాగే వానల్ పాడ్ నుండి వంజర వరకు డబల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ముధోల్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నాటి నుంచి రెండున్నర సంవత్సరాల కాలంలో నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వీవో భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, గోదాముల నిర్మాణాలకు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా మరిన్ని నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.సుంక్లి గ్రామంలో కూడా దశలవారీగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే రామారావు పటేల్ హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.అన్న బాహు సాఠే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ ఎంఆర్‌పీఎస్ నాయకులు, అన్న బాహు సాఠే అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తి దేవస్థానం అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వినతిపత్రం అందజేసిన దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్

శ్రీకాళహస్తి (వాయిస్ టుడే)ఆగస్టు 30. శ్రీకాళహస్తి పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను వివరిస్తూ ముఖ్యమంత్రి కి వినతిపత్రాన్ని అందజేశారు.వినతిపత్రంలో ప్రధానంగా గుడ్డేరు కాలువపై నూతనంగా నిర్మించదలచిన వంతెన (బ్రిడ్జి) నిర్మాణానికి సంబంధించిన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ట్రాఫిక్ సమస్యల నుంచి గణనీయమైన ఉపశమనం లభించడంతో పాటు పట్టణ రవాణా వ్యవస్థ మరింత సులభతరం అవుతుందని వివరించారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అంశాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూడనున్నట్లు సానుకూలంగా స్పందించారు.

## పేద కుటుంబానికి అండగా ఖానాపూర్ ఎమ్మెల్యే

**సీఎం సహాయ నిధి నుండి 7.50 లక్షల ఎల్ ఓ సి అందించిన వెడ్మ బొజ్జు పటేల్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 30: నిర్మల్ జిల్లా పెంబి మండలం మండపల్లి గ్రామానికి చెందిన మర్రి అశన్న విడీసీ సమస్యతో బాధపడుతూ శస్త్రచికిత్స అవసరమైన పరిస్థితిలో ఉన్నారు. హైదరాబాద్‌లోని ఎన్ఐఎంఎస్ ఆసుపత్రి వైద్యులు శస్త్రచికిత్సకు సుమారు రూ.7.50 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన అశన్న పరిస్థితిని తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చికిత్సకు అవసరమైన రూ.7.50 లక్షల మొత్తానికి ఎల్ ఓ సి మంజూరు చేయించేలా చొరవ తీసుకున్నారు. పేదల వైద్య అవసరాలకు అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు భరోసా కల్పిస్తున్న ఎమ్మెల్యే చొరవపై అశన్న కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని హెలిపాడ్ వద్ద కలిసిన బిజెపి కోలా ఆనంద్



శ్రీకాళహస్తి (వాయిస్ టుడే) ఆగస్టు 30: తొట్టంబేడు మండలంలోని సీ.సీ.ఎన్ కన్వెన్షన్ హాల్ నందు జరిగిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పి.ఆర్. మోహన్ కుమార్తె వివాహ శుభాకార్యానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ని హెలిపాడ్ వద్ద కలిసిన బిజెపి కోలా ఆనంద్ కుమార్ స్వాగతం మరియు వీడ్కోలు పలకడం జరిగింది. అనంతరం నారా చంద్రబాబు నాయుడు తో కలిసి వివాహ వేడుకకు హాజరై,నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 30: జిల్లా: నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ పట్టణం, నిర్మల్ రూరల్, సోన్, మామడ, లక్ష్మణచందా, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను బీజేపీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 226 మంది లబ్ధిదారులకు 56,43,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, మండల నాయకులు, సర్పంచులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే బొజ్జల

శ్రీ కాళహస్తి (వాయిస్ టుడే) ఆగస్ట్ 30: శ్రీకాళహస్తికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఎం జీ ఎం హాస్పిటల్ హెలిప్యాడ్ వద్ద స్వయంగా ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి వారికి ఆత్మీయంగా ఆహ్వానం పలకడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.ఈ సందర్భంగా వారికి శ్రీకాళహస్తీశ్వర స్వామి, శ్రీ జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల పవిత్ర తీర్థ ప్రసాదాలను అందజేశాను. ఆ స్వామి వారి ఆశీస్సులు ముఖ్యమంత్రి కి ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నాను.ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధ రెడ్డి.అక్కడినుండి కళ్యాణ మండపం కి వచ్చి టిడిపి సీనియర్ నాయకుడు పి ఆర్ మోహన్ సతీమణి ఇందిర పెళ్లికూతురు డింపుల్ పెళ్ళికొడుకు రాజేష్ నూతన వధూ వరుణ్ణి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీర్వదించినారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుజ్జుల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి టిడిపి నాయకులు కార్యకర్తలు కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎల్.ఎల్.బి పట్టా పొందిన శీతల్కర్ అరవింద్‌కు ఘన సన్మానం

## గ్రామంలో మొట్టమొదటి అడ్వకేట్‌గా అరవింద్ ఎదగడం గర్వకారణం: గ్రామ పెద్దలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 30: నిర్మల్ జిల్లా తానూర్ మండలం, హంగిర్గా గ్రామం తనూర్ మండలంలోని హంగిర్గా గ్రామానికి చెందిన శీతల్కర్ అరవింద్ ఎల్.ఎల్.బి పట్టా పొందిన సందర్భంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని బుద్ధ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత మరియు గ్రామస్తులు పాల్గొని అరవింద్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శీతల్కర్ ప్రకాష్, కస్తూరాబాయి దంపతులకు మూడవ సంతానమైన అరవింద్, చిన్ననాటి నుంచే చదువుపై ఎంతో ఆసక్తి, పట్టుదల కలిగిన వ్యక్తిగా ఎదిగారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. జీవితంలో ఎన్నో కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, అనేక అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ తన లక్ష్యాన్ని చేరుకోవడం అభినందనీయమని అన్నారు.

మారుమూల గ్రామంలో జన్మించి, సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి తన విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ ఎల్.ఎల్.బి పట్టా సాధించి అడ్వకేట్‌గా ఎదగడం అరవింద్ కృషికి నిదర్శనమని గ్రామస్తులు పేర్కొన్నారు. ముఖ్యంగా హంగిర్గా గ్రామం నుంచి మొట్టమొదటి అడ్వకేట్‌గా నిలవడం గ్రామ ప్రజలందరికీ ఎంతో సంతోషకరమైన, గర్వకారణమైన విషయమని తెలిపారు.

“ఒకప్పుడు మన గ్రామ వీధుల్లో సాధారణ విద్యార్థిగా తిరిగిన అరవింద్.. నేడు న్యాయవాదిగా పట్టా పొంది అదే గ్రామ ప్రజల మధ్య సన్మానం అందుకోవడం ప్రతి ఒక్కరికీ భావోద్వేగ క్షణం” అని గ్రామ పెద్దలు అన్నారు. కష్టపడితే మారుమూల గ్రామంలో పుట్టినవారు సైతం ఉన్నత శిఖరాలను అధిరోహించగలరనే విషయాన్ని అరవింద్ తన ప్రయాణంతో నిరూపించారని కొనియాడారు. గ్రామంలోని యువతకు అరవింద్ ఒక ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్తులో న్యాయ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి పేదలు, బలహీన వర్గాలు మరియు న్యాయం కోసం ఎదురుచూస్తున్న వారికి అండగా నిలవాలని గ్రామస్తులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ అప్పా, ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అరవింద్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, ప్రేమాభిమానాలతో అరవింద్ తన భవిష్యత్ ప్రయాణంలో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

“హంగిర్గా మట్టిలో పుట్టి... ఎన్నో కష్టాలను దాటి... చదువే ఆయుధంగా ముందుకు సాగి... నేడు అదే గ్రామంలో అడ్వకేట్‌గా గౌరవం అందుకోవడం అరవింద్ విజయమే కాదు, మొత్తం గ్రామానికి గర్వకారణం.”

## బాధిత కుటుంభ సభ్యులను పరామర్శించిన మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 30: నిర్మల్ జిల్లా ముధోల్ మండలం చింతకుంట గ్రామా సర్పంచ్ గంగాధర్ యొక్క తండ్రి గారైన గంగారం ఇటీవల మృతి చేందడం జరిగింది ,విషయం తెలుసుకున్న మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ వారి నివాసానికి వెళ్లి, కుటుంభ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబానికి ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం కల్పిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు,అదే విధంగా వీరితో మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్ ,సంజు గ్రామకార్యకర్తలు,వార్డ్ మెంబర్లు గ్రామ యువకులు పాల్గొనడం పాల్గొన్నారు.

## దినదినాభివృద్ధి చెందుతున్న అన్నదాన సత్రం!



సూర్యాపేట, ఆగస్టు 30(వాయిస్ టుడే ప్రతినిధి.) సూర్యాపేట జిల్లా ,మఠంపల్లి మండలంలో బజ్జూరు వెంకట్నరసయ్య సహకారంతో, ఆంధ్ర, తెలంగాణ దాతల, దాతృత్వంతో నిర్మితమైన, మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉన్న, శ్రీకృష్ణదేవరాయ మున్నూరు కాపు అన్నదాన సత్రం దాతల సహకారంతో దినదినాభివృద్ధి చెందుతుంది. కమిటీ సహకారంతో, పుష్కరాలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా మున్నూరు కాపు సత్రంలో పదివేల మందికి పైగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ , భక్తులకు ఆరాధ్య దైవంగా నిలుస్తుంది. శ్రీశైలం ట్రస్ట్ మెంబర్, మట్టపల్లి అన్నదాన సత్రం డైరెక్టర్‌గా ఉన్న రామ్ శెట్టి విజయ శ్రీ నిర్వహణలో, స్థానిక సర్పంచ్ రామ్ శెట్టి విజయశాంతి అప్పారావు ,కన్వీనర్ తోట వెంకయ్య నాయుడు, కమిటీ సభ్యులు, కార్యదర్శి బి. అచ్యుతరావు సహాయ సహకారాలతో ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తూ, భక్తుల మన్ననలు పొందుతున్నారు. 40 గదులతో నిర్మితమై, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు డైనింగ్ హాల్‌తో, నిత్య, నైవేద్యాలతో శ్రీకృష్ణదేవరాయ మున్నూరు కాపు అన్నదాన సత్రం విరాజిల్లుతుంది. మట్టపల్లి పుణ్యక్షేత్రమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ని దర్శించుకున్న వేలాదిమంది,భక్తులు లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న అనంతరం, మున్నూరు కాపు అన్నదాన సత్రంలో ఆతిథ్యం స్వీకరిస్తూ , విశ్రాంతి తీర్చుకుంటున్నారు. భక్తుల కోరిక మేరకు, దాతల సహకారంతో నిర్మించిన గదులను, ఇటీవల జనసేన రాష్ట్ర నాయకులు ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మాజీ శాసనసభ్యులు సామినేని ఉదయభాను , ఇటీవల కాలంలో ఏసీ గదులను భక్తుల సౌకర్యార్థం ప్రారంభించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను కమిటీ దాతల సహకారంతో పూర్తి చేయనున్నట్లు శ్రీకృష్ణదేవరాయ మున్నూరు కాపు అన్నదాన సత్ర కన్వీనర్ తోట వెంకయ్య నాయుడు తెలిపారు.




## పాత ఎల్లాపూర్ గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం

**60 ద్విచక్ర వాహనాలు,8 ఆటోలు స్వాధీనం జరిమానాలు విధింపు**
**ప్రజలు సైబర్ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
**యువత గంజాయి బారిన పడకుండా తల్లి తండ్రులు చూసుకోవాలి**
**ఒక్క సిసి కెమెరా వంద మంది పోలీసులతో సమానం**
**నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్**

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 30: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ఆదేశాల మేరకు,నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈరోజు ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టి, అనుమతులు/పత్రాలు లేని లి60లి ద్విచక్ర వాహనాలు, లి8లి ఆటోలను స్వాధీనం చేసుకొని, నిబంధనల మేరకు జరిమానాలు విధించడం జరిగింది. అదేవిధంగా గ్రామంలోని ప్రజలకు ట్రాఫిక్ నియమాలు పట్ల, గంజాయి పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని,మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని,సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిసి కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఇటువంటి తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐలు రాహుల్, సాయి కుమార్, హనుమాండ్లు, సర్పంచ్, ఉప సర్పంచ్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## నిర్మల్ నియోజకవర్గంలోని పలు వివాహ వేడుకలకు హాజరైన కూచాడి శ్రీహరిరావు

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 30: నిర్మల్ నియోజకవర్గంలోని పలు వివాహ వేడుకలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కూచాడి శ్రీహరిరావు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించారు. వారితో పాటు నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీంరెడ్డి , మార్కెట్ కమిట్ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్,లక్ష్మణ్ చందా మండల అధ్యక్షులు కొండ్రు నరేష్ రెడ్డి,ఆత్మ కమిటీ చెర్మన్ కొండ్రు రాంరెడ్డి, పర్పెల్లి ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ వాగులో కొట్టుకొచ్చిన తప్పిపోయిన వృద్ధుడి మృతదేహం



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 30: నిర్మల్ జిల్లా సోన్ పోలీస్ స్టేషన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదాపూర్ గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం సువర్ణ వాగులో ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం, జాఫర్‌పూర్ గ్రామానికి చెందిన లోలం చిన్నయ్య (75) గత ఆగస్టు 22న ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చిన్నయ్య కనిపించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆగస్టు 25న పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 106/2026, ఖ/ఎ మీఖఅ వీఅంంఅఅస్త్ర కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో మాదాపూర్ గ్రామ శివారులోని సువర్ణ వాగులో వృద్ధుడి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని పరిశీలించగా అది తప్పిపోయిన లోలం చిన్నయ్యదిగా గుర్తించారు. వాగు నీటిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నాడు సోన్ పోలీస్ స్టేషన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాదాపూర్ గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం సువర్ణ వాగులో ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాల ప్రకారం, జాఫర్‌పూర్ గ్రామానికి చెందిన లోలం చిన్నయ్య (75) గత ఆగస్టు 22న ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చిన్నయ్య కనిపించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆగస్టు 25న పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 106/2026, ఖ/ఎ మీఖఅ వీఅంంఅఅస్త్ర కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం సుమారు 12:30 గంటల సమయంలో మాదాపూర్ గ్రామ శివారులోని సువర్ణ వాగులో వృద్ధుడి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతదేహాన్ని పరిశీలించగా అది తప్పిపోయిన లోలం చిన్నయ్యదిగా గుర్తించారు. వాగు నీటిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు.

## గోదావరి పుష్కరాలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలి జిల్లా కలెక్టర్



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 30: నిర్మల్ జిల్లాలోని బాసర పుష్కర క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాటు చేయాలని కలెక్టర్ భావేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని గోదావరి పరివాహంలోని అన్ని పుష్కర ప్రదేశంలో పుణ్య స్థానాలకు వచ్చే భక్తులతో పాటు వీఐపీలు పివిఐపీలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు త్వరలోనే అన్ని పుష్కల గట్ల వద్ద ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.




## బాసర భక్తులకు శుభవార్త ఉచిత మినీ బస్సు సేవ ప్రారంభం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 30: నిర్మల్ జిల్లా బాసర ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఉచిత మినీ బస్సు సేవ ఆదివారం నుండి ప్రారంభం కానుంది ఈ బస్సు గోదావరి ఘాట్ ఆలయం రైల్వే స్టేషన్ మధ్య నడవనుంది. ఎస్బిఐ ఆర్థిక సహకారంతో బస్సు అందుబాటులోకి వచ్చింది. హైదరాబాద్ లో జరిగిన కార్యక్రమంలో ఆలయ ఈవో అంజనీ దేవికి బ్యాంక్ అధికారులు బస్సులు అందజేశారు. ఎస్బిఐ చైర్మన్ చల్ల శ్రీనివాసులు చెట్టిని ఈవో సత్కరించారు. అనంతరం స్థానాచార్యులు ప్రవీణ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో అంజనీదేవి వీఐ చైర్మన్ ఆలయ అర్చకులు ఎస్బిఐ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
సోమవారం 31 ఆగస్టు 2026

# పేదల ఇంటి కలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## - ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా ఆగస్టు 30, వాయిస్ టుడే: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలకు సొంత గృహాలను అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. పేదల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి, సామాజిక భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు లక్షల ఆర్థిక సహాయంతో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు ప్రారంభించారు. నూతన గృహాల వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ, రాష్ట్రంలో పేదలందరికీ గౌరవప్రదమైన జీవనం అందించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. సొంత ఇల్లు ప్రతి కుటుంబానికి ఒక భద్రత, ఒక భరోసా అని, ఆ కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో సొంత ఇల్లు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన గృహాలను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం నూతన గృహాల లబ్ధిదారులతో ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నూతన గృహ ప్రవేశంతో కుటుంబాల్లో నెలకొన్న ఆనందాన్ని చూసి వారిని అభినందించారు. లబ్ధిదారులు కూడా ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పన్నాల రాములు, స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..



## వివాహ వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొన్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్

జహీరాబాద్, ఆగస్టు 30 (వాయిస్ టుడే) : జహీరాబాద్ పట్టణంలోని ఎన్ కన్వెన్షన్, రాజా ప్యాలెస్‌తో పాటు ఝరాసంగం మండల కేంద్రంలోని వాసవి కళ్యాణ మండపంలో నిర్వహించిన వివాహ వేడుకల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అనంతరం జహీరాబాద్ పట్టణంలోని దత్తగిరి కాలనీలో నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమంలో, అలాగే బసవ ఫంక్షన్ హాల్‌లో జరిగిన శుభకార్యాల్లో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశం, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, ప్రభు పటేల్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ ఓ సి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 30: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స పొందుతున్న బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు మంజూరైన ఎల్ ఓ సి చెక్కులను బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అందజేశారు. సారంగాపూర్ మండలం బోరిగాం గ్రామానికి చెందిన గుమ్మల నర్సింహులు కుటుంబానికి మెరుగైన వైద్యం కోసం లిరూ.2 లక్షలలి ఎల్ ఓ సిచెక్కును అందజేశారు. అదేవిధంగా నిర్మల్ పట్టణంలోని నాయిడివాడకు చెందిన నామెద గంగామణి కుటుంబానికి వైద్య చికిత్స నిమిత్తం రూ .75 వేల ఎల్ ఓ సి చెక్కును అందజేశారు. ఆపద సమయంలో తమ కుటుంబాలకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## 22ఏ భూదోపిడీపై సమరశంఖం

### సెప్టెంబర్ 5, 6న మహా దీక్షను విజయవంతం చేయాలి: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 30: రాష్ట్రంలో 22ఏ భూముల పేరుతో జరుగుతున్న అక్రమాలను నిరసిస్తూ సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న రెండు రోజుల మహా దీక్షను విజయవంతం చేయాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. నిర్మల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ అధ్యక్షతన మహా దీక్ష సన్నద్ధతపై నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిర్మల్ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి దీక్షను విజయవంతం చేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోరారు. 22ఏ భూముల సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రజల తరఫున బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, మేడిశెమ్మె రాజు, ఆకుల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీలు రవీందర్ రెడ్డి, కరిపే విలాస్, అంకం మహేందర్, నిర్మల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు, సర్పంచులు, బీజేవైఎం నాయకులు, స్థానిక బీజేపీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో పాల్గొన్న శివంపేట మాజీ సర్పంచ్ నవీన్ గుప్తా

నర్సాపూర్ : ఇల్లుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జింక మల్లేష్ గారి కుమార్తె వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ శుభ కార్యానికి శివంపేట్ గ్రామ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవీన్ గుప్తా పాల్గొన్నారు ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి నిండు నూరేళ్లు సూపర్ సంతోషంతో ఆయురారోగ్యాలతో పిల్ల పాపలతో ఉండాలని ఆయన తెలిపారు ఆయన వెంట పిల్లుట్ల గ్రామ సర్పంచ్ బూర మురళి గౌడ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు మరియు మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్

జహీరాబాద్, ఆగస్టు 30 (వాయిస్ టుడే) : మొగుడంపల్లి మండలంలోని ఎస్‌వీకే గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ) మాజీ చైర్మన్ మహమ్మద్ తన్వీర్ పాల్గొన్నారు. మొగుడంపల్లి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుభాష్. బావమరిది వివాహ వేడుకలకు హాజరైన మహమ్మద్ తన్వీర్ నూతన వధూవరులను ఆశీర్వదించిన అక్షింతలు వేసి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సిద్ధం ఉజ్వల్ రెడ్డి, శ్రీకాంత్, హర్షవర్ధన్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ డంపు స్వాధీనం



చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ మిషన్–2026 ముగిసినప్పటికీ అక్కడి అడవుల్లో భద్రతా బలగాలు ఏరియా డామినేషన్ ఆపరేషన్లను నిరంతరాయంగా కొనసాగిస్తున్నాయి. సుక్మా జిల్లాలోని కొంటా పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్పోచ–గోంపడ్ రహదారి వెంబడి ఉన్న అడవిలో డీఆర్‌జీ (డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గార్డ్), బస్తర్ ఫైటర్స్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో రెండు టిఫిన్ బాంబులు, భారీ పరిమాణంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మరోపక్క నారాయణ్‌పూర్ జిల్లాలో స్థానిక పోలీసులు, బీఎస్ఎఫ్ బలగాలు అదనార్ అడవుల్లో చేపట్టిన ఆపరేషన్‌లో పది రైఫిల్స్, బీజీఎల్ సెల్స్, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి.



## మధిర నియోజకవర్గ అభివృద్ధికి కృషి

### డిప్యూటీ సీఎం భట్టి

బోనకల్లు : రాష్ట్రంలో మధిర నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బోనకల్లు, చింతకాని మండలాల్లో రూ.131 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రహదారులు అభివృద్ధి చెందితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామాలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రూ.57 కోట్లతో కలకోట, రాపల్లి, గన్నవరం, ముసలిమడుగు, లక్ష్మీపురం రహదారికి శంకుస్థాపన చేశారు. అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులుకు సూచించారు. కలకోటకు నూతనంగా మంజూరైన విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయాన్ని భట్టి ప్రారంభించారు.

## హజ్రత్ షేక్ షహాబుద్దీన్ సర్కార్ 676వ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న జహిరాబాద్ మాజీ మంత్రి డా॥ ఏ. చంద్రశేఖర్

జహిరాబాద్ ఆగస్టు30 (వాయిస్ టుడే): జహీరాబాద్ మండలంలోని షేకాపూర్ గ్రామంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న హజ్రత్ షేక్ షహాబుద్దీన్ షహీద్ 676వ ఉర్స్–ఏ–షరీఫ్ వేడుకలకు జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి డా॥ ఏ. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పవిత్ర చాదర్ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు మరియు భక్తులతో ఆయన మాట్లాడారు. ?అనంతరం డా॥ ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఉర్స్–ఏ–షరీఫ్ వంటి ఆధ్యాత్మిక వేడుకలు సమాజంలో సోదరభావం, ఐక్యత, శాంతి మరియు సామరస్యాన్ని పెంపొందిస్తాయని, భిన్నత్వంలో ఏకత్వానికి ఇవి ప్రతీకలని పేర్కొన్నారు. ఇంత ఘనంగా జాతరను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, షేకాపూర్ ప్రజలందరికీ ఉర్సు శుభాకాంక్షలు తెలిపారు. షేకాపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని, గ్రామాభివృద్ధి కోసం తగిన నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ?ఈ సందర్భంగా షేకాపూర్ గ్రామ సర్పంచ్, దర్గా కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ చేష్మోద్దీన్.. డా॥ ఏ. చంద్రశేఖర్ బృందానికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ



కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు హుగ్గేల్లి రాములు, పవన్ రాథోడ్, జహీరాబాద్ పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్, మాజీ మండల అధ్యక్షులు మాక్సూద్ అహ్మద్, మాజీ పట్టణ అధ్యక్షులు కండేం నర్సింలు, మాజీ వైస్ చైర్మన్ ఖాజా, కౌన్సిలర్ మహేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు జె.జె. జావీద్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**